

ఉపాధ్యాయులకు పరీక్ష!
వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. పదో పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాని ఉత్తర్వులిచ్చింది. - 10లో..



వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె తొలగింపు
కూటమి నేతల ప్రోద్బలంతో పోలీసులు, అధికారులు అత్యుత్సాహంతో మూకుమ్మడిగా వచ్చి వైఎస్సార్ సీపీ జెండాను తొలగించారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
37 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడవచ్చు.

జీ(వి)తాలు నిలిపేసి!



అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తాం.. నిరుద్యోగులకు ఉద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రగల్భాలు పలికారు కూటమి నేతలు. అధికారంలోకి వచ్చాక మాట మార్చేశారు. చిరుద్యోగులపై వేధింపులు ఆపై తొలగింపుల పర్వం కొనసాగుతోంది. పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న 1200 ఆప్కాస్ కార్మికులను విధుల నుంచి తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. తాజాగా సీహెచ్‌లను సైతం అదేవిధంగా వేధింపులకు గురిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయమని అడిగితే ఉద్యోగాలు పీకేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోతున్నారు. దీనిపై అన్ని వర్గాల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆరు పురపాలక సంఘాల్లో 1200 కార్మికులపై వేటు
- వస్తులతో అవస్థలు పడుతున్నా కనికరించని వైనం
- ఒంగోలు కార్పొరేషన్‌లో మేస్త్రీల తొలగింపు
- 27 రోజులు సమ్మె చేసినా పట్టించుకోని పాలకులు
- గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న సీహెచ్‌ఓల పట్ల పాలకులు చిన్నచూపు
- సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓల జీతాలు ఆపేసి కక్ష సాధింపు
- ఉద్యోగాలు పీకేస్తామంటూ మంత్రి బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులకు కష్టాలు మొదలయ్యాయి. పలు విభాగాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. దీనిని అధికార పార్టీ నేతలు తమకు ఆదాయవన రుగా మార్చుకున్నారు. జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో కలుపుకొని 1200 మందికి పైగా ఆప్కాస్ కార్మికులు ఉన్నారు. అయితే ఉన్న పళంగా వీరిని విధుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలకు పస్తులు తప్పలేదు. పారిశుధ్య కార్మికులనే కాకుండా ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు 232 మంది ఉన్నారు. వారికి సైతం వేధింపులు తప్పలేదు. వాహనాల డ్రైవర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పార్కులు, డివైడర్లలో మొక్కలు నాటే వాళ్లతో పాటుగా వాటర్ బాయ్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు ఉన్నారు. వీరందరిపై రాజకీయ ముద్రలు వేసి వేధిస్తున్నట్లు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వీరిలో కొంత మందిని ఉద్దేశపూర్వకంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ల వద్ద వాచ్‌మన్ డ్యూటీలు వేయడం వేధింపులకు పరాకాష్టగా చెబుతున్నారు. ఇక ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మేస్త్రీలపై కన్నేశారు. కార్పొరేషన్లో 681 మంది పారిశుధ్య కార్మికులు ఆప్కాస్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరిలో 77 మంది మేస్త్రీలు ఉన్నారు. వారు పనిదొంగలు, గంజాయి బ్యాచ్ అంటూ కామెంట్లు చేయడం తోపాటు వారిపై రాజకీయ ముద్రలు వేసి విధుల నుంచి తొలగించారు. వారితో పాటుగా కోవిడ్ సమయంలో తీసుకున్న మరో 38 మేస్త్రీలను కూడా విధుల నుంచి తీసేశారు.

ఆప్కాస్‌ను రద్దు చేసే కుట్రలు...

ఇటీవల ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం తెలిసిందే. ఆప్కాస్‌ను రద్దు చేసి లోకల్ టెండర్లు వేయాలని కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ప్లాన్ చేస్తుంది. తద్వారా కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల బొజ్జలు నింపేందుకు కుట్రలు చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులకు ఉన్న కొద్దిపాటి సౌకర్యాలు కూడా రద్దయిపోతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పీఎఫ్ కొండెక్కినట్టేనని, బానిస బతుకులు మొదలవుతాయని చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని 27 రోజుల పాటు సమ్మె చేసినా పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

సీహెచ్‌ఓలపై కక్ష సాధింపులు...

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను నియమించింది. రూ.25 వేల జీతంతో పాటుగా రూ.15వేల ఇన్సెంటివ్ ఇచ్చే ఒప్పందంపై నియామకాలు జరిగాయి. అప్పటి నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదే విధంగా జీతాలు ఇస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం రాగానే సీహెచ్‌ఓలను వేధించడం మొదలుపెట్టింది. ఇన్సెంటివ్‌లను ఆపేసింది. విలేజ్ క్లినిక్‌లకు అద్దెలు ఇవ్వడం నిలిపివేసింది. ఇంకా అనేక సౌకర్యాలను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రిని కలిశారు. వినతిపత్రాలు ఇచ్చారు. అయినా పట్టించుకోకపోవడంతో అనివార్యంగా సమ్మెకు దిగారు. సీహెచ్‌ఓలు సమ్మెకు దిగి వారం రోజులైంది. పల్లె ప్రజల వైద్య సేవలు కుంటుపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యతా పరీక్షలను కూడా సీహెచ్‌ఓలే చేస్తుంటారు. ఇవన్నీ ఆగిపోయాయి. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

ఉద్యోగాలు తీసేస్తామని బెదిరింపులు

తొమ్మిది రోజులుగా సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఎలాంటి చొరవ చూపడం లేదు. ఈ నెల సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓల జీతాలను నిలిపివేశారు. సీహెచ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమేనని, ఎక్కువ చేస్తే ఉద్యోగాలు పీకేస్తామంటూ ఇటీవల సాక్షాత్తూ ఆరోగ్య శాఖ మంత్రి బెదిరింపులకు దిగడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ పెద్దలు వీరిని చర్చలకు పిలవడం కానీ, సమస్య పరిష్కారం కోసం ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించడం కానీ చేయడం లేదు. ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము కొండమీది కోతిని అడగడం లేదని, ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయమని మాత్రమే అడుగుతున్నామని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

యర్రగొండపాలెం: అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా మండలంలోని గోళ్లవిడిపిలో గురువారం నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.30,116, రెండో బహుమతి రూ.20,116 అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 93918 87740, 9398564477 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏడుకొండలు



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జి సూపపండెంట్‌గా ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జమున కడప మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ అద్దెయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, బాలాజీ నాయక్, ప్రభాకర్ , డీడీ మంజుల, ఏఓ లక్ష్మి కుమారి, ఆఫీస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

ఒంగోలు సిటీ: ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ సైమన్ విక్టర్ అన్నారు. పరీక్షల నిర్వహణపై కళాశాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, స్క్వాడ్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 46 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం, 27 పరీక్ష కేంద్రాల్లో ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఇంటర్నెట్, వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కేంద్రంలో పని చేసే సిబ్బంది ఎవ్వరూ ఫోన్ తీసుకురాకూడదన్నారు. వేసవిలో దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రోగుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

- వైద్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్

మద్దిపాడు: ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయడం వల్ల సదరు వ్యక్తి ఎక్కడికి వెళ్లినా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అక్కడ ఉన్న డాక్టర్లు వైద్యం చేయడానికి సులవవుతుందన్నారు. ఓపీ, ల్యాబ్ పరీక్షల వివరాలు, మందుల వివరాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సంకేతిక సమస్య ఉంటే తనకు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి వైద్యులు శ్రావణ్‌కుమార్, ఆనందమోహన్, జగదీష్, వినీలచౌదరి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ఒంగోలు సబర్బన్: కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కార్డులతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సచివాలయాల్లో రైస్ కార్డుకు సంబంధించి 7 సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త బియ్యం కార్డు, బియ్యం కార్డులో సభ్యుల చేరిక, బియ్యం కార్డును విభజించడం, కార్డు నుంచి సభ్యుల తొలగింపు, కార్డును అప్పగించడం, చిరునామా మార్పు, తప్పు ఆధార్ సీడింగులు సరిదిద్దడం వంటి సేవలను ప్రారంభిస్తూ బుధవారం నుంచి సచివాలయాల్లో సంబంధిత ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అమ్మనబ్రోలులో హై అలర్ట్

- నేడు వీరయ్య చౌదరి పెద్దకర్మ
- భారీగా పోలీసులు మోహరింపు
- వీఆర్‌కు ఒంగోలు తాలూకా సీఐ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసు జరిగి నేటికి 17 రోజులైంది. ఆయన స్వగ్రామంలో గురువారం పెద్దకర్మ నిర్వహించనున్నారు. వీరయ్య అంత్యక్రియలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత హాజరు కావడం తెలిసిందే. గురువారం జరిగే పెద్దకర్మకు టీడీపీ రాష్ట్ర నాయకులు అనేక మంది హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు హత్యకు గురైన వీరయ్య చౌదరి, హత్య కేసులో ప్రధాన అనుమానితులంతా అమ్మనబ్రోలుకు చెందిన వారే కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో ఏ క్షణమైనా ఏదైనా జరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ముందస్తు చర్యల్లో భాగంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు బుధవారం అమ్మనబ్రోలులోనే గడిపారు. ప్రధాన రాజకీయ పార్టీ నాయకులతో నాగులప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని కోరారు. అదే సమయంలో అమ్మనబ్రోలు పంచాయతీ కార్యాలయం ఆవరణలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 7 గంటలకల్లా విధుల్లో పాల్గొనాలని, ఏమాత్రం అజాగ్రత్త లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అమ్మనబ్రోలులో హతుడు వీరయ్య చౌదరి నివాసానికి సమీపంలోనే ప్రధాన అనుమానితుడిగా చెబుతున్న టీడీపీ యువనేత నివాసం ఉంది. ప్రధాన అనుమానితుడి ఇంటి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ముగ్గురు ఎస్సైలతో సహా 150 మంది పోలీసులతో భారీగా పోలీసులను మోహరిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద అమ్మనబ్రోలు హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

వీఆర్‌కు తాలుకా సీఐ ..

ఇదిలా ఉండగా తాలుకా సీఐ అజయకుమార్‌ను వీఆర్‌కు పంపిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరయ్య చౌదరి హత్య కేసులోనే తాలుకా సీఐని వీఆర్‌కు పంపించినట్లు సమాచారం. తాలుకా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కార్యాలయంలో ఏప్రిల్ 22వ తేదీన వీరయ్య చౌదరిని దారుణంగా హత్య చేశారు. తరువాత జాతీయ రహదారి మీదుగా దర్జాగా పారిపోయారు. ఈ హత్యకు ముందు నిందితులు పది రోజుల పాటు రెక్కీ నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. తాలుకా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా పసిగట్టడంలో పోలీసులు వైఫల్యం చెందారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలోనే సీఐ అజయ్‌కుమార్‌పై వేటు పడిందన్న ప్రచారం జరుగుతోంది. హత్య కేసు విచారణలోనూ ఆయన సమర్థవంతంగా వ్యవహరించలేదని అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తుంది. అయితే వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసు యంత్రాంగం మొత్తం వైఫల్యం చెందిందని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేవలం సీఐ అజయ్‌ని వీఆర్‌కు పంపించడంతోనే ఆగుతారా లేక మరింత మంది పోలీసులపై చర్యలు తీసుకుంటారా అనే చర్చ జోరుగా సాగుతోంది.

సూత్రధారులు, పాత్రధారులంతా పోలీసుల అదుపులోనే...

వీరయ్య చౌదరి హత్య కేసు దాదాపుగా కొలిక్కి వచ్చినట్లేనన్న ప్రచారం జరుగుతోంది. ప్రధాన సూత్రధారుడిగా చెప్పుకుంటున్న అమ్మనబ్రోలు టీడీపీ యువనేత, ప్రధాన పాత్రధారుడిగా చెబుతున్న కొప్పోలు ఇసుక వ్యాపారి, హత్యలో పాల్గొన్న నెల్లూరుకు చెందిన ఇద్దరు కిరాయి హంతకులు హంతకులకు డబ్బులు అందజేసినట్లు చెబుతున్న సిద్ధాంతి పోలీసుల అదుపులోనే ఉన్నారు. ఈ హత్య జరిగిన తీరు, హత్యకు ఎవరెవరు సహకరించారు, హత్యలో ఎంత మంది పాల్గొన్నారు, రెక్కీకి ముందు ఏ లాడ్జిలో ఉన్నారు తదితర వివరాలను విచారణలో సేకరించినట్లు తెలుస్తుంది. వీరయ్య చౌదరి పెదకర్మ తరువాత ఏ క్షణంలోనైనా పోలీసులు ఈ కేసును ముగించవచ్చని సమాచారం.

బొప్పాయి రైతులకు తీరని నష్టం



మాలకొండాపురంలో దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ కుసుమ

- గాలివానకు దెబ్బతిన్న బొప్పాయి తోటలు
- నలుగురు రైతులకు రూ.15 లక్షల మేర నష్టం

పామూరు: ఈదురుగాలుల వర్షానికి బొప్పాయి రైతులకు తీరని నష్టం మిగిల్చింది. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన గాలివానకు బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. మండలంలోని మాలకొండాపురంలో రైతులు నళినీదేవి, కల్లూరి రామిరెడ్డి, తాటికొండ సింహాద్రి, వి.వెంకట్రామరాజులు సాగు చేసిన 6 హెక్టార్లలో బొప్పాయి పంట దెబ్బతింది. అధికశాతం బొప్పాయి చెట్లు కాయలతో ఉన్నవి విరిగి పడిపోయాయి. దీంతో చెట్టుకు కాసిన కాయలు కూడా దెబ్బతినగా అటు చేతికొచ్చిన పంట, చెట్లు పడిపోయి రాబేయే పంట కూడా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దెబ్బతిన్న పంటలను మండల ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ బుధవారం మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. రైతులకు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లిందని హెచ్‌ఓ కుసుమ తెలిపారు.పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు. గాలివానకు పామూరుతో పాటు మండలంలోని బోడవాడలో చెట్లు విరిగిపడగా, బోడవాడ రోడ్డులో విద్యుత్‌వైర్లు తెగిపోయాయని గ్రామస్తులు తెలిపారు.

లేజర్ వైద్య పరికరం ప్రారంభం

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి చర్మవ్యాధుల విభాగంలో రూ.50 లక్షలతో కొత్తగా ఏర్పాటైన లేజర్ వైద్య పరికరాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య చికిత్స కోసం వచ్చే రోగులు సంతృప్తి చెందేలా వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలని చెప్పారు. పీజీ నిధుల నుంచి ఈ లేజర్ పరికరాన్ని ఏర్పాటు చేశామని చర్మవ్యాధుల విభాగాధిపతి డాక్టర్ బాలాజీ నాయక్ కలెక్టర్‌కు వివరించారు. వైద్య పరికరంతో పిగ్మెంటేషన్, నల్లమచ్చలు, పచ్చబొట్లు, మొటిమల వాపు లాంటివి తగ్గించవచ్చన్నారు. తేలికపాటి లేజర్ తరంగాల ద్వారా సురక్షితంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. జీజీహెచ్‌లోని వివిధ విభాగాలకు ఆధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ జమున, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు స్ఫూర్తి, కళ్యాణి, బాషా పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో లేజర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

యుద్ధం వస్తే ఇలా ఎదుర్కొందాం..



రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



రైల్వేస్టేషన్ ఆవరణలో మాక్‌డ్రిల్ పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు వద్ద మాక్‌డ్రిల్
- సైరన్ మోగినప్పుడు తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో మాక్‌డ్రిల్

ఒంగోలు టౌన్:

‘ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పద బ్యాగు ఉన్నట్లు పోలీసులకు ఫోన్ వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పోలీస్ జాగిలాలను రంగంలోకి దించారు. అనుమానాస్పద బ్యాగును గుర్తించారు. ఆ బ్యాగులో పేలుడు పదార్థాలు వున్నట్లు పోలీస్ జాగిలం గుర్తించింది. ఆ ప్రాంతానికి ప్రజలను వెళ్లకుండా క్యూ మేనేజర్ ఏర్పాటు చేశారు. బాంబు డిస్పోజల్ సూట్ ధరించిన పోలీసులు బాంబును నిర్వీర్యం చేశారు’.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఎలాంటి ఉపద్రవం వచ్చినా ఎదుర్కొనేలా ప్రజలను అప్రమత్తం చేసేందుకు బుధవారం నగరంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో నిర్వహించిన మాక్‌డ్రిల్ ప్రజల్లో ఆలోచన రేకెత్తించింది. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సైరన్ మోగినప్పుడు ఏం చేయాలి, అగ్ని పేలుడు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి, అనుమానాస్పద బ్యాగులో బాంబులు పెట్టి వెడితే ఏం చేయాలనే విషయాలు, పౌరుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా 244 జిల్లాలను భద్రతాపరంగా ప్రత్యేకమైన ప్రాంతాలుగా కేంద్రం గుర్తించిందని అందులో మన రాష్ట్రంలో విశాఖ ఒకటని తెలిపారు.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో నగరంలోని రైల్వే స్టేషన్ , ఆర్టీసీ బస్టాండుల్లో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. ఒంగోలు నగరంతో పాటుగా టంగుటూరు పరిసర ప్రాంతాల్లో పెట్రోలియం సంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నందున భద్రతపై దృష్టి సారించామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఏమైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 112కు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, సీఐలు నాగరాజు, మేడా శ్రీనివాసరావు, హజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయండి

- కలెక్టర్‌ను కలిసి విన్నవించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు జీఓ ఎంఎస్ నంబర్-65ను అమలు చేయాలని సంఘ నేతలు బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రకాశం భవన్‌లోని బుధవారం కలెక్టర్‌ను కలిసి జిల్లాలో పదోన్నతుల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రవికుమార్, ఎం బెన్‌హర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జీఓ ఎంఎస్ నంబర్ 65 అమలుచేస్తూ పదోన్నతులు ఇస్తున్నారన్నారు. అయితే జిల్లాలో డీపీఓ, కార్యాలయ సిబ్బంది ఉద్దేశపూర్వకంగా హైకోర్టు ఉత్తర్వులను, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు, జీఓను నిర్లక్ష్యం చేస్తూ తాత్సారం చేస్తున్నారని విన్నవించారు. నిబంధనల ప్రకారం పదోన్నతులు ఇచ్చే ముందు పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన సీనియారిటీ లిస్టులో న్యాయబద్ధమైన అభ్యంతరాలను పరిగణలోనికి తీసుకోవడం లేదని వివరించారు. ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టు ప్రకారం పదోన్నతులు కల్పించాలని, అక్రమంగా పదోన్నతులు పొందిన వారిని తిరిగి వెనక్కి తీసుకువచ్చి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శి సంఘం వైస్ ప్రెసిడెంట్లు వై. శివ రంగారావు, కె.వెంకట్రావు, పి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ నాగేశ్వరరావు, ఎస్‌కే. మీరా సాహెబ్, ఉజ్వల్ ప్రసన్న కుమార్, మల్లికార్జున్, భాగ్యరాజ్, పి వెంకటేశ్వరరావు, వై వినయ్‌పాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉసురు తీసిన విద్యుత్ కంచె

- సుబాబుల్ కోతకొచ్చి, కూలి మృతి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి


మృతి చెందిన వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: అడవి పందుల వేట కోసం పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఓ కూలీ ఉసురు తీయగా, మరొకరిని గాయాలపాలు చేశాయి. ఈ సంఘటన బుధవారం వేకువజామున సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో గుమ్మలంపాడు వెళ్లే ఎన్ఎస్పీ కాలువ వద్ద పొలాల్లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తి మండలం ముప్పవారిపాలెం గ్రామానికి చెందిన మాలికల వెంకటేశ్వర్లు(45), కత్తి దుర్గారావు గుడిపాడు సమీపంలోని సుబాబుల్ తోటలో కర్ర కోతకు వచ్చారు. అడ్డదారిలో సుబాబుల్ తోటలో గుండా వెళ్తున్న క్రమంలో అడవి పందుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కాళ్లకు తగిలాయి. విద్యుదాఘాతానికి గురైన మాలికల వెంకటేశ్వర్లు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన కత్తి దుర్గారావు ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలానికి సుమారు కిలోమీటరు దూరంలో ఎన్ఎస్పీ కాలువ వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ తీగలు లాగినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ ఉదయ్ కుమార్ తెలిపారు.

పెనుగాలులతో విద్యుత్ శాఖకు రూ.8 లక్షల నష్టం

మార్కాపురం: మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, పెద్దదోర్నాల ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి సుమారు 65కు పైగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతోపాటు కండక్టర్ వైర్లు తెగిపోయాయి. సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లిందని విద్యుత్ ఏడీఈ సియా నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కాపురం మండలంలోని గజ్జలకొండలో 20, మిట్టమీదిపల్లిలో 10, వేములకోటలో 2, కొండేపల్లిలో 4, మార్కాపురం టౌన్‌లో 3, పెద్దదోర్నాలలో 10, పెద్దారవీడులో 15కు పైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయని వివరించారు.

ప్రభుత్వ తీరుతో స్కూళ్ల మనుగడ ప్రశ్నార్థకం

- రేపు ప్రకాశం భవనం ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

ఒంగోలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న పాలకుల విధానాలను ప్రతిఘటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలలు నెలకొల్పి విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

డీహెచ్‌టీటీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సబర్బన్: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు 53 సీట్లు, ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు మాత్రమే కేటాయించిన తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు అవకాశం ఉందని వివరించారు. మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ(డీహెచ్‌టీటీ) డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, 2024 జూలై ఒకటో తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులకు 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు, ఎస్సీ ఎస్టీలకు 25 ఏళ్లలోపు వయసు ఉండాలని స్పష్టం చేశారు. ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్(టెక్స్‌టైల్స్), ఐటీఐ రెండేళ్ల కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నేరుగా డీహెచ్‌టీటీ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. అడ్మిషన్ కోసం జూన్ ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్ వెబ్‌సైట్ చూడాలని, 08625 295003, 93999 36872, 98661 69908, 90102 43054ను సంప్రదించాలని తెలిపారు.

ఉపాధ్యాయులకు పరీక్ష!

- పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- అరకొరగా హాజరవుతున్న విద్యార్థులు
- వేసవి సెలవుల్లో ఒత్తిడి చేస్తున్నారని టీచర్ల గగ్గోలు
- విద్యాశాఖ ఉత్తర్వులపై తీవ్ర అసంతృప్తి


బేస్తవారిపేట బాలుర హైస్కూల్లో హాజరైన ముగ్గురు విద్యార్థులు


బాలికల హైస్కూల్లో హాజరైన ఇద్దరు విద్యార్థినులు

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతోంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మే నెలలో రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు తీసుకుంటున్న టీచర్లను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తారు. పది పరీక్షలకు పూర్తి స్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తూ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులపై ఆందోళన

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నెల 2న ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు 3వ తేదీన ఉపాధ్యాయ, వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో ఉపాధ్యాయులు మండు వేసవిలో ఇదెక్కడి న్యాయమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని ఈఎల్ ప్రస్తావన

విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఎక్కడా ఆర్జిత సెలవుల ప్రస్తావన లేకపోవడం, రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ఆదివారం, సెలవు దినాల్లో కూడా పనిచేయాలని పేర్కొనడంపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. పరీక్షలకు ముందు వంద రోజుల ప్రణాళిక, దసరా, సంక్రాంతి సెలవుల్లో పనిచేసిన వారికి సీసీఎల్ మంజూరు చేస్తామని చెప్పి నేటికీ ఇవ్వకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

అరకొరగా విద్యార్థుల హాజరు

జిల్లాలోని పలు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు ఫెయిలైన విద్యార్థులు అరకొరగా హాజరవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ పిల్లలను పాఠశాలకు పంపాలని కోరుతున్నా సరైన స్పందన ఉండటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒక్కో పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు మాత్రమే వస్తున్నారు. జిల్లాలోని 38 మండలాల్లో ఫెయిలైన విద్యార్థుల సంఖ్య, దూరం, అక్కడి పరిస్థితుల ఆధారంగా రెండు, మూడు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్ టీచర్లు పాఠశాలకు వస్తున్నారుకాని విద్యార్థుల నుంచి స్పందన కరువైంది.

> **ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి**
>
> 
>
> ప్రత్యేక తరగతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం అకస్మాత్తుగా విడుదల చేసిన నేపథ్యంలో అంగీకారం తెలిపిన వారితోనే తరగతులు నిర్వహించాలి. విధులు నిర్వర్తించిన వారికి తప్పనిసరిగా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు వేసవి సెలవుల నేపథ్యంలో దూరప్రాంతాలకు వెళ్లగా వారిని బలవంతంగా రప్పించారు.
>
> – సొరెడ్డి లక్ష్మిరెడ్డి, బేస్తవారిపేట మండల యూటీఎఫ్ అధ్యక్షుడు

సర్పంచ్‌ను స్టేషన్‌కు రప్పించి.. వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె తొలగింపు


దగ్గరుండి మరీ దిమ్మెకు సున్నం పూయిస్తున్న అధికారులు

- జెండా దిమ్మెకు నోటీసులు అంటించిన పంచాయతీ కార్యదర్శి
- కూటమి నేతల ప్రోద్బలంతో అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు


అధికారుల సాక్షిగా వైఎస్సార్ సీపీ జెండా తొలగింపు

కొనకనమిట్ల: కూటమి నేతల ప్రోద్బలంతో పోలీసులు, అధికారులు అత్యుత్సాహంతో మూకుమ్మడిగా వచ్చి వైఎస్సార్ సీపీ జెండాను తొలగించడంతోపాటు దిమ్మెకు సున్నం పూయించారు. ఈ సంఘటన కొనకనమిట్ల మండలం వెలిగండ్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామ నడిబొడ్డున రెండేళ్ల క్రితం ఎవరికీ ఇబ్బంది లేని ప్రదేశంలో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె నిర్మించారు. దీనిని ఓర్వలేని గ్రామ టీడీపీ నేతలు కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జెండా దిమ్మె తొలగించాలని అధికారులు, పోలీసులపై ఒత్తిడి చేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మండల స్థాయి అధికారులు, ఎస్సై సహా 20 మంది పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. పారిశుధ్య కార్మికులతో జెండా తొలగింపజేసి, దిమ్మెకు సున్నం పూయించారు. ఈ తతంగానికి కొంత సమయం ముందుగా వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ అయిన పాతకోట వెంకటరెడ్డిని ఎస్సై రాజ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అక్కడే వేచి ఉండేలా చేయడం గమనార్హం. ×గడిచిన 40 ఏళ్లుగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులే సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా విజయం సాధిస్తున్నారు. ఇది మింగుడు పడని టీడీపీ నేతలు ఎలాగైనా వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయాలని చూడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

దౌర్జన్యానికి మూల్యం చెల్లించకతప్పదు

కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్ సీపీ శ్రేణులపై దౌర్జన్యానికి పాల్పడటం మంచి పద్ధతి కాదని, అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి హెచ్చరించారు. ఎవరికీ ఇబ్బంది లేని చోట జెండా ఏర్పాటు చేస్తే పంచాయతీ కార్యదర్శితో సర్పంచ్‌కు నోటీసు ఇప్పించడాన్ని తప్పుబట్టారు. వైఎస్సార్ సీపీ దిమ్మెకు కార్యదర్శి నోటీసు అంటించడమేంటో అర్థం కావడం లేదన్నారు. కూటమి నేతల ప్రోద్బలంతో పోలీసులు, అధికారులు వ్యవహరించిన తీరుపై కోర్టుకు వెళ్తామని చెప్పారు.

బాలికపై అత్యాచారం

- నిందితుడు టీడీపీకి చెందిన విద్యా కమిటీ చైర్మన్
- ప్రస్తుతం ఆ బాలిక 6 నెలల గర్భిణి



గిద్దలూరు రూరల్: అధికార పార్టీకి చెందిన ఓ కామాంధుడు బాలికపై అత్యాచారానికి పాల్పడి 6 నెలల గర్భిణిని చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గిద్దలూరు మండలంలోని ఉయ్యాలవాడలో చిల్లరవ్యాపారం కొనసాగించే ఓ మహిళ కుమార్తె(15)పై అదే గ్రామానికి చెందిన విద్యా కమిటీ చైర్మన్ కన్నేశాడు. పట్టణంలో బంగారం వ్యాపారం చేసే అతను మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. మార్చి 20వ తేదీన బాలికతో ఉండగా తల్లి నిలదీయడంతో ఉడాయించాడు. బాలిక 6 నెలల గర్భిణి అని తెలుసుకున్న తల్లి.. అందుకు కారణం విద్యా కమిటీ చైర్మనే అని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గిద్దలూరు చేరుకుంది. డబ్బు, అధికారం గల ఆ వ్యక్తి తమకు న్యాయం జరగనివ్వకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించింది. బాలిక తల్లి ఆరోపణలపై సీఐ కె.సురేష్‌ను వివరణ కోరగా.. బాలికపై అత్యాచారం విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

'అల్లూరి' పోరాటం స్ఫూర్తిదాయకం

- ఘనంగా నివాళులర్పించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు


అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు సబర్బన్: మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఒంగోలులోని అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ పాలకులను ఎదిరించి, అడవి బిడ్డలకు అండగా నిలిచి 27 ఏళ్ల వయసులోనే ప్రాణ త్యాగం చేసిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. బ్రిటీష్ వారికి ముందుగానే చెప్పి మరీ ఆయుధాలు కొల్లగొట్టిన ధీరుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, బీఎన్ విజయకుమార్, మేయర్ సుజాత, జేసీ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

దోబీ ఉద్యోగాలు రజకులకే ఇవ్వాలి

- రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి డిమాండ్


మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ కార్యాలయాలు, మెడికల్ కళాశాలలు, వసతి గృహాల్లో దోబీ ఉద్యోగాలను రజకులకే ఇవ్వాలన్న జీఓ నం.27ను అమలు చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలుకు వచ్చిన ఆమె స్థానిక ఎన్ఎస్పీ అతిథి గృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ షాపింగ్ దుకాణాల్లో రజకులకు 5 శాతం దుకాణాలు కేటాయించాలన్నారు. రజకులపై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలను తెలిపేందుకు జీఓ నం.6ను అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. మానిటరింగ్ కమిటీ సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పంచాయతీల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు రజకులను అనుమతించాలన్నారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలో ఐదుగురు మానిటరింగ్ కమిటీ సభ్యులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం సమాజంపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దారుణం

- సందర్భమేదైనా ముస్లింలపై విషం చిమ్ముతున్నారు
- డిప్యూటీ సీఎంను అరెస్టు చేయాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ డిమాండ్


తాలుకా పోలీసు స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న ఎస్డీపీఐ నాయకులు

ఒంగోలు టౌన్: సమయం, సందర్భంతో పనిలేకుండా అవకాశం చిక్కినప్పుడల్లా ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి విద్వేష ప్రసంగాలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అరెస్టు చేయాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ సత్తార్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి బుధవారం తాలుకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ జరిగిందన్న ఆరోపణలు వచ్చినప్పుడు ఆ సంఘటనతో ఏమాత్రం సంబంధం లేకపోయినా ముస్లింలతోపాటు పవిత్ర మక్కాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారిపై ఏమాత్రం సానుభూతి చూపించకపోగా దేశంలోని ముస్లింపై విషం కక్కడం సమంజసం కాదన్నారు. పవన్ కళ్యాణ్ మతి భ్రమించి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్వేష ప్రసంగాలతో ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా, పదవుల కోసం ఎవరైనా సొంత మనుషులను చంపుకొంటారా అని ప్రశ్నించారు. లక్ష పుస్తకాలు చదివినట్లు చెప్పుకుంటూ తిరిగే పవన్ కళ్యాణ్‌కు దేశ సమైక్యత, సామరస్యత కోసం ఎలా మెలగాలో తెలియకపోవడం బాధాకరమన్నారు. డిప్యూటీ సీఎం పదవిలో ఉంటూ ఒక సామాజికవర్గానికి వ్యతిరేకంగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమన్నారు. డిప్యూటీ సీఎంను మందలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ నాయకులు పఠాన్ ఖాజా వలి, సీటు ఖాదర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో పొగాకు బోర్డు విఫలం

- నిమ్మకు నీరెత్తినట్టుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు
- వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకోకుంటే ఉద్యమ బాట
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల ధ్వజం


వెల్లంపల్లిలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న కేవీవీ ప్రసాద్, ఇతర నాయకులు

మద్దిపాడు: పొగాకుకు గిట్టుబాటు ధర దక్కేలా చూడటంలో టుబాకో బోర్డు విఫలమైందని, ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని ఏపీ రైతు సంఘ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. పొగాకు కొనుగోళ్ల విషయంలో కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. పొగాకు రైతులతోపాటు వరి, మిర్చి సాగు చేసిన రైతులు సైతం కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పొగాకు వ్యాపారులు సిండికేట్ అయ్యి ధరలను నియంత్రిస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియను టుబాకో బోర్డు ఈడీ పరిశీలించి రైతుల పక్షాన నిలవాలని డిమాండ్ చేశారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ.. పొగాకు రైతుల కష్టాలను పట్టించుకోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. గిట్టుబాటు ధర కల్పించే వరకు విశ్రమించేది లేదన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ.. వేలానికి తెచ్చిన బేళ్లను సాకులు చెప్పి వెనక్కు పంపడం దారుణమన్నారు. నోబిడ్, కంపెనీ రిజెక్ట్ పేరుతో బేళ్లను తిప్పి పంపడం వల్ల రైతులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందన్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రం రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, పావులూరి అంజయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య.. వ్యాపార లావాదేవీలపై సమీక్ష

- సభ్యుల పెంపు, ధాన్యం సేకరణపై సూచనలిచ్చిన జేసీ


సమాఖ్య ఉద్యోగులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ది ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ వ్యాపార కార్యకలాపాలపై జాయింట్ కలెక్టర్, సమాఖ్య అధికారిక పర్సన్ ఇన్‌చార్జి ఆర్.గోపాలకృష్ణ సమీక్షించారు. బుధవారం స్థానిక సమాఖ్య ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. సమాఖ్య ద్వారా ఎరువుల క్రయవిక్రయాలు, ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా వరి ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. సమాఖ్య పురోభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలిచ్చారు. సమాఖ్యలో సభ్యుల సంఖ్య పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాపార పరిధిని విస్తరించడానికి నూతన ఎరువుల డిపోలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమాఖ్య పరిధిలోని ఎరువుల డిపోలను పారదర్శకంగా కంప్యూటరీకరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యాలయ సిబ్బంది, అన్ని బ్రాంచ్‌ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.